# జాతీయ స్థాయిలో ఏడు అతివిశిష్ట రైలు సేవా పురస్కార్‌లు సాధించిన దక్షిణ మధ్యరైల్వే

తార్నాక, డిసెంబర్ 13 ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో ఏడు అతివిశిష్ట రైలు సేవా పురస్కార ఆవార్డులను దక్షిణ మధ్యరైల్వే సిబ్బంది సాధించినట్లు దక్షిణ మధ్యరైల్వే పేర్కోంది. వివిధ రంగాల్లో సేవలందించిన ఏడుగురి సిబ్బంది ఈ నెల 15న ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు. ఏడు ఆవార్డులను దక్కించుకున్న దక్షిణ మధ్యరైల్వే జోన్‌లో జాతీయ స్థాయిలో తమ సత్తాను చాటుకుంది. పురస్కారాలు పొందిన ఏడుగురిలో కాజీపేటలో ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్స్ లో డిప్యూటీ చీఫ్‌గా పనిచేస్తున్న డిఎస్.రామారావు, విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో పనిచేస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సి.హెచ్.దినేష్ రెడ్డి, రైల్వే బోర్డులో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న మల్లెల శ్రీకాంత్, నిజామాబాద్‌లోని రైల్వే రక్షక దళంలో సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న టి.ప్రత్యుష, సికింద్రాబాద్‌లోని సీనియర్ డీసీఎం స్క్వాడ్‌లో ముఖ్య టికెట్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.నటరాజన్, బీదర్‌లో సీనియర్ ట్రాక్ మెయింటెయినగర్‌గా(గేట్ మ్యాన్) గా పనిచేస్తున్న వీ.వీ.రంగయ్య తదితరులు పురస్కారాలు పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆవార్డు పొందిన వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ఆవార్డులు ఉద్యోగుల మనో ధైర్యాన్ని పెంపొందిస్తాయని, సిబ్బంది మరింత కష్టపడి పనిచేసేలా స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.



హైదరాబాద్ వార్త

## 16 న నెక్లెస్ రోడ్‌లో 5కె రన్, చిన్ననాటి ఆటలు

సైఫాబాద్, డిసెంబరు 13 ప్రభాతవార్త: తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (టిటిఎ) ఆధ్వ ర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీ ఉదయం 'నా ఊరు-ఆ రోజుల్లో' పేరిటి 5కె రన్ నక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహిస్తున్నామని అవసరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్, టిటిఎ చీఫ్ కో-ఆర్డినేటర్ డా.ద్వారకానాథ్‌రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు బికాస్‌కారార్ తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం యువతీ యువకులు చిన్ననాటి ఆటలు మరిచిపోతున్నారని, అంతరించిపోతున్న ఆటలను తిరిగి సమాజానికి తెలియజేయడానికి వీలుగా ఆ రోజు మధ్యాహ్నం నుంచి యువతీ యువకులకు గిల్లిదండ, గోలీలు, బొంగరం, తొక్కుడు బిళ్ళ, అష్టా చెమ్మ, కచ్చకాయలు, రింగ్, ఒముడు గుంటలు, జంగ్లింగ్ ఫీట్స్, బాల్స్, లట్టు, దాగుడు మూతలు, తాడాట (స్కిపింగ్), తదితర ఇండియన్ ట్రేడిషనల్ గేమ్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నేడు ప్రతి ఒక్కరి చేతిలోకి మెబైల్ ఫోన్ రావడంతో ఆనాటి ఆటలకు పిల్లలకు దూరం అయ్యారని విచారం వ్యక్తం చేశారు. నేటి తరం పిల్లలకు ఈ ఆటలను పరిచయం చేయడం కోసం తాము కృషి చేస్తున్నామని వారు వివరించారు.

## ఆటో డ్రైవర్లు ఆందోళన చెందవద్దు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సైఫాబాద్, డిసెంబరు 13 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటిల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగిందని, దీంతో రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు ఆందోళనలు చెందవలసిన అవసరం లేదని అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం అఖిల భారత అసంఘటిత కార్మికులు అండ్ ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర చైర్మన్ కౌషల్ సమీర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం భట్టి విక్రమార్క నివాసంలో మర్యాదపూర్వకరంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆటో విభాగం రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మహాలక్ష్మి పథకం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ఆధైర్యపడవద్దని 15 రోజులు ఓపిక పడితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ప్రతి పక్ష పార్టీలకు చెందిన ఆటో సంఘాల నాయకులు చెప్పె మాటలు నమ్మి తొందరపడవద్దని తొమ్మిదన్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఒక్క రోజు కూడా ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 రోజులు కూడా కాలేదని అప్పుడే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. మంత్రిని కలిసిన వారిలో కెకెసి నాయకులు పింగళి సంపత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, బాల్‌రాజ్, ఎర్రవెల్లి రాములు, సుజాత పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శ



యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 13 ప్రభాతవార్త : తుంటి ఎముక గాయంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు తిరిగి రావాలని ఆ దేవుళ్లను వేడుకుంటున్నామన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో తెలంగాణను అన్ని రంగాలలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపారని, అలాంటి మంచి నాయకుడు వేగంగా కోలుకోవాలని తెలంగాణ వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేస్తున్నారన్నారు. 24.గంటల నాణ్యమైన కరెంటు సరఫరా, ఇంటింటికి సురక్షితమైన తాగునీటి సరఫరా, సకాలంలో రైతులకు రైతుబంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పించన్లు ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదుకున్నారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు.

# గృహజ్యోతిపై డిస్కం కసరత్తు

**జనవరి లేదా ఫిబ్రవరిలో అమలు చేసే అవకాశం**

**200 యూనిట్లలోపు మీటర్లు లెక్కలు తీస్తున్న అధికారులు**

**40లక్షలకు పైగా లబ్దిదారులు ఉండే అవకాశం**

**నష్టాలను నివారిస్తే.. భారమేమీ కాదంటున్న నిపుణులు**



హైదరాబాద్, డిసెంబరు 13,ప్రభాతవార్త: ఆరుగ్యారెంటీల హామీల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి ,చేయూత పథకాలను అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా గృహజ్యోతి పథకంపై దృష్టి సారించింది. నెలకు 200యూనిట్లలోపు వాడే గృహవినియోగదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తుంది. అందుకు వందరోజుల్లో ఈపథకాన్ని అమల్లోకి తీసుకురావాలని భావిస్తుంది. ఈమేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్‌పిడిసిఎల్) కసరత్తు ప్రారంభించింది. ఈపథకం అమల్లోకి వస్తే సుమారు 40లక్షల మంది వినియోగదారులకు నెలవారీ విద్యుత్ బిల్లుల నుంచి ఊరట లభించే అవకాశం ఉంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్,రంగారెడ్డి,మేడ్చల్ జిల్లాల పరిధిలో తొమ్మిది సర్కిళ్లు ఉన్నాయి. వీటిలో గృహవిద్యుత్ కనెక్షన్లు 52లక్షల వరకు ఉండగా నెలకు 200యూనిట్ల లోపు విద్యుత్ వాడే వినియోగదారులు సుమారు 40లక్షలవరకు ఉన్నట్లు అంచనా ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరుగ్యారంటీలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఆమేరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలలకు తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసి (ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్) బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయాన్ని 10లక్షలు పెంచి ప్రారభించారు. ఇప్పటివకే ఈరెండు కీలక హామీలను నెరవేర్చిన ప్రభుత్వం .తాజాగా గృహలక్ష్మిమీద దృష్టిసారించినట్లు తెలుస్తుంది. జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ఈపథకాన్ని కూడా అమల్లోకీ తీసుకురానున్నట్లు తెలుస్తుంది.

**రోజుకు సగటున 55 ఎంయుల వినియోగం..** గ్రేటర్ జిల్లాల పరిధిలో రోజుకు సగటున 55మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుంది. దీంట్లో 40శాతం విద్యుత్ గృహ అవసరాలకు వినియోగిస్తుంటారు. మెజార్టీ విద్యుత్ వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక అవసరాలకే ఖర్చవుతుంది. సంస్థకు అధిక ఆదాయం కూడా ఆవర్గాల నుంచి లభిస్తుంది. అలాగే గృహపరిశ్రామిక, వాణిజ్య వినియోగదారుల నుంచి బిల్లులరూపంలో నెలకు (సాధారణ రోజుల్లో )రూ.900కోట్లు వరకు రెవెన్యూవస్తుంది. వేసవిలో ఈబిల్లులు 1200కోట్లవరకు వసూలు అవుంది. ప్రభుత్వం ఉచిత విద్యుత్ హామీతో సంస్థపై నెలకు రూ.200కోట్లభారం పడనుంది. ఈపథకం కింద తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వంపై ఏటా 3,431 కోట్లకు పైగా భారం పడనుందని అంచనా దీంట్లో అధికంగా గ్రేటర్ నుంచి 2400కోట్లకుపైగా భారం పడనుంది.

**నష్టాలను నియంత్రిస్తే భారమేమీ కాదు..** టెక్నికల్, కమర్షియల్, ఇతర అంతర్గాత నష్టాలను అధిగమించడం ద్వారా ప్రభుత్వం పేద,మధ్యతరగతి గృహవినియోగదారులకు సమర్థవంతంగా ఉచిత విద్యుత్ ఇవ్వవచ్చు. జవాబుదారీతనంతో నిజాయితీగా పనిచేసే ఇంజనీర్లకు కీలమైన ఫోకల్ పోస్టుల్లో కూర్చోబెట్టడం, టెక్నికల్, కమర్షియల్ నష్టాలను తగ్గించుకోవడం వల్ల సంస్థపై కనీసం భారం లేకుండా ఈపథకాన్ని సమర్థవంతంగా అమలు చేయవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లూజ్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఫెల్యూర్, ఓవర్‌లోడ్ తగ్గించడం, మీటర్‌బైవెరిఫికేషన్ పేరుతో అనవసర ఎస్టిమేషన్లు వేయకుండా ఉండటం, కేటగిరీలవారిగా కనెక్షన్లు గుర్తించి, పక్కాగా రీడింగ్ నమోదు చేసి బిల్లులు జారీ చేయడం, హెచ్‌టి సర్వీసులపై గట్టినిఘా పెట్టడం, స్మార్ట్ మీటరింగ్, ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ సర్వీసులను ఏర్పాటు చేయడం,హెచ్‌టి మీటర్ రీడింగ్ నమోదలుఓ ఆలసత్వం వహించిన ఏడిఈలపై చర్యలు తీసుకోవడం, సిటిపిటిలో తలెత్తె సాంకేతిక సమస్యలను సరిచేయడం, అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులను కీలకపోస్టులను తప్పించడం, సంస్థ ను పూర్తిగా ప్రక్షాలన చేయడంతోపాటు డిపిఈ, విజిలెన్స్ వింగ్ బలోపేతం చేయడం ద్వారా సంస్థపై ఎలాంటి భారం లేకుండా ఎంపిక చేసిన లబ్దిదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయవచ్చునే అభిప్రాయం వ్యక్తమవుతుంది.



సిఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసిన సిటీ నూతన కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన నగర సిపి

హైదరాబాద్, డిసెంబర్ 13, ప్రభాతవార్త: హైదరాబాద్ నూతన పోలీసు కమిషనర్‌గా బుధవారం ఉదయం బాధ్యతలు చేబట్టిన కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. సచివాలయంలో సిఎం రేవంత్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసిన కొత్త కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అనంతరం కొద్దిసేపు ఆయనతో సిటీ పోలీసు విభాగం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శాంతి భద్రతలు, నేరాల నివారణ తదితర అంశాలపై ఇరువురు చర్చించారని సమాచారం. కొత్త కమిష నర్ శ్రీనివాస్ రెడ్డిని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి అభినందించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారని తెలిసింది.

## ఉత్పత్తిపై కాకుండా నేల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

**ఎన్ఐపిహెచ్ఎం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్‌సింగ్**



సదస్సుకు హనుమాన్‌సింగ్ వివిధ దేశాల ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబరు 13,ప్రభాతవార్త: దేశంలోని ఉత్పత్తిదారులు ఉత్పత్తిపై కాకుండా నేల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్‌మేనేజ్‌మెంట్ (ఎన్ఐపిహెచ్ఎమ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ అన్నారు. ఈమేరకు బుధవారం హెచ్ఐసిసిలో బయోఅగ్రి 2023పేరుతో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా 300మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని మొక్కడం.. సుభసూచికంగా భావించే దేశంలో మనం జీవిస్తున్నామని ..కబడ్డి లాంటి క్రీడ అయినా , రంగస్థలంపై ప్రదర్శించే కళాకారుడు అయినా పంటలు పండించే రైతు అయినా, భూమిని మొక్కడం యుగయుగాల సాంప్రదాయం అన్నారు. కానీ మనం ఆనేల ఆరోగ్యంపై శ్రద్ధ చూపకుండా ఇష్టానుసారంగా రసాయనాలు వాడుతూ భూకాలుష్యానికి పాల్పడుతున్నామన్నారు. కావున రసాయన సాంకేతికతను ఉపయోగించుకుండా స్థానిక వనరులు ఉపయోగించి బయో ఎరవులను ఎలా ఉత్పత్తి చేయాలో ఎన్ఐపిహెచ్ఎం రైతులకు శిక్షణ ఇస్తుందన్నారు.రైతులకు, ఇతర ఉత్పత్తిదారులకు భూకాలుష్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు, బిపిపిఎ కార్యదర్శి డాక్టర్ డి.ఆర్.వెంకటేష్ పాల్గొన్నారు.

## మంచి హృదయంతో సాంస్కృతిక, కళారంగానికి పనిచేసేవారిని ప్రోత్సహించాలి

**విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు**

చిక్కడపల్లి, డిసెంబరు 13 ప్రభాతవార్త: మంచి హృదయంతో సాంస్కృతిక, కళారంగానికి అంకితభావంతో పనిచేసే సంస్థలు నిరాటంకంగా ముందుకు సాగుతాయని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాలు, స్వర్గీయ వేమరాజు నరసింహారావు 94వ జయంతి కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర లెక్కల గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర, న్యూక్లియర్ ఫ్యుయెల్ కాంప్లెక్స్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షలబ్ సక్సేనా, సంగీత క్షీరసాగరం వి.ఆనందమోహన్, నవ్యసాహితి సమితి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర, ప్రముఖ రచయిత్రి డాక్టర్ యు.కుసుమకుమారి, నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేమరాజు విజయకుమార్, ఆర్ఎన్.సుధారాణి, కోఆర్డినేటర్ ఎన్.సుధామాల, కోశాధికారి యుహెచ్.హరినాథ్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు బ్రిటన్‌లో సాంస్కృతికరంగ ప్రచారకులు రమా వీ.శాంతారామ్‌ను సత్కరించిన అనంతరం జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడారు. వేమరాజు నరసింహారావు సాహితీ సాంస్కృతికరంగానికి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. కళలన్నీ



కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు

తెలుగు నేల నుంచి ఉద్భవించినవని, ఈ రంగానికి చెందిన వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నృత్యగురువులు రేణుక ప్రభాకర్, శ్రీలత నారపరాజు, వాణీరమణ, ఎస్.మృణాళిని, నళిని రమణ, అడప భరణి, మధుమతి కులకర్ణి, స్నేహా రామ్‌చందర్, ఆర్.చంద్రశేఖర్ శిష్య బృందం 'నృత్యప్రభ' పేరుతో అద్భుతంగా నిర్వహించిన ప్రదర్శనలు అందరిని అలరించాయి.

## జెఎన్‌టియుసిలో సౌత్ జోన్ టెన్నిస్ టీం ఎంపిక



కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 13, ప్రభాతవార్త : కూకట్‌పల్లి జెఎన్‌టియూ యూనివర్సిటీలో సౌత్‌జోన్ టెన్నిస్ టీం ఎంపిక బుధవారం జరిగింది. యూనివర్సిటీ క్రీడాప్రాంగణంలో కొత్తగా నిర్మాణం చేసిన టెన్నిస్ కోర్టులో క్రీడాకారులు ఎంపిక జరగగ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ డాక్టర్ ఎన్.ఎస్.దిలీప్ క్రీడాకారులు ఎంపిక నిర్వహించారు. యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నియామకం అయిన తరువాత డాక్టర్ కట్ట నరసింహారెడ్డి స్పోర్ట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని క్రీడాకారులకు ఏది అవసరం ఉన్న వెంటనే వారు మంజూరు చేసి యూనివర్సిటీలో ఉత్తమ సౌకర్యాలు కలిగిస్తున్నారు. కాబట్టి నేడు యూనివర్సిటీ నుండి పలు క్రీడాకారులు ఆయా క్రీడల్లో ప్రతిభ చూపి పలు పోటీల్లో పాల్గొని యూనివర్సిటీకి పేరు తెస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డా.నల్లగొండ అశోక్ క్రీడాకారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ మంచి శిక్షణ ఇస్తూ ఉండడం వల్ల మెరుగైన క్రీడాకారులు తయారు అవుతున్నారని పోటీలో నిలిచి గెలుస్తున్నారని అన్నారు. ఎంపికైన వారు డిసెంబర్ 27 నుండి 30వరకు కృష్ణా యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు.

### మీరాలం మండిలో వైభవంగా ఛండీ హోమం

చార్మినార్, డిసెంబరు 13 ప్రభాతవార్త : పాతబస్తీ మీరాలం మండిలోని శ్రీ మహాంకాళేశ్వర దేవాలయంలో అమ్మ వారికి శ్రీ చక్ర అర్చన,ఛండీ హోమం జరిగింది.దేవాలయం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య,చంద్రకళ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మందిరంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

## ఆరోగ్య సంరక్షణ కోసమే ఆసుపత్రి నిర్మాణం

ఎల్‌బినగర్, డిసెంబర్ 13 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని భావితరాల ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురిలో నూతనంగా నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్స్ పనులను ఎమ్మెల్యే బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 26 అంతస్థులతో ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందని తెలిపారు. స్థలాలు దిరకడం కష్టంగా భావించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని ఒప్పించి పోలీస్‌స్టేషన్, చిల్డ్రన్‌పార్క్, సబ్‌స్టేషన్, వాటర్‌ట్యాంక్, కమ్యూనిటిహాల్ నిర్మిస్తున్నామన్నారు. అలాగే గుడి, మసీదు కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 2 స్లాబుల నిర్మాణం జరిగిందని, ప్రతి నెలకు ఒకసారి ఒక్కో స్లాబ్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. నాణ్యత ప్రమాణాలు, భద్రత చర్యలు పాటిస్తూ పనులు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, అధికారులు సుభాష్, రాజు, ఆశాజ్యోతి, పద్మాకర్ పాల్గొన్నారు.

## ఆర్థిక సమస్యలతో విద్యకు దూరం కావొద్దు

### విద్యార్థులకు రూ.5 లక్షల చెక్కులను పంపిణీ

ఎల్‌బినగర్, డిసెంబర్ 13 ప్రభాతవార్త: పేదరికం ఆర్థిక సమస్యలతో ఎవరు కూడా విద్యకు దూరం కావద్దని వైఆర్‌పి ఫౌండేషన్ చైర్మన్ వెలిశాల రవి ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని వైఆర్‌పి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిరుపేద విద్యార్థిని, విద్యార్థుల విద్య కోసం రూ.5 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసమాజంలోని పేద విద్యార్థిని, విద్యార్థులకు వైఆర్‌పి ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటూ వారి విద్యకు సహాయం అందిస్తుందన్నారు. వైఆర్‌పి ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులను గుర్తించి వారి ఉన్నత చదువులకై వెబ్సైట్ అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరమైతే వైఆర్‌పి కార్యాలయంలో సంప్రదిస్తే తమ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.వెంకట్‌రెడ్డి, టి.నరసింహారావు, ఎడ్ల కృష్ణారెడ్డి, శేషగిరిరావు, మురిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, వాసు పాల్గొన్నారు.

## విద్యారంగ బలోపేతానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలి

**ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి**

**ముఖ్యమంత్రికి యూటీఎఫ్ నేతల విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ముషీరాబాద్, డిసెంబర్ 13, ప్రభాతవార్త: నూతనంగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని టీఎస్‌యుటీఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) రాష్ట్ర నాయకులు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు పాటుపడాలని కోరారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ రద్దు చేయాలని, పదోన్నతుల సంక్షోభాన్ని పరిష్కరించాలని, జీఓ నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని వేతనాలు, బకాయిలు సకాలంలో చెల్లించాలని, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ వినతి పత్రం అందచేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి మేనిఫెస్టోలో హామీలను తప్పకుండా అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీఎస్‌యుటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావరవి, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఏ.వెంకట్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఈ.గాలయ్య, ఎ.సింహాచలం, వై.జ్ఞానమంజరి, పత్రిక ప్రధాన సంపాదకులు కొండయ్య, గురుకుల ఉపాధ్యాయ నాయకులు నర్సింహ, కే.జి.బి.వి. రాష్ట్ర ప్రతినిధి విశాలాక్షి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్ నాయక్, వెంకటప్ప, రఘుపాల్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ నేతలు

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఉప్పల్ నేతల సత్కారం

ఉప్పల్, డిసెంబర్ 13 ప్రభాతవార్త: ఉప్పల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారి లక్ష్మారెడ్డిని బుధవారం ఉప్పల్ భగాయత్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పోగుల దయాకర్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జెట్ట సుధాకర్, డా.లింగరాజు, వాకిటి బుచ్చిరెడ్డి, చంద్రయ్యగుప్త, అంజిరెడ్డి, వెంకన్న, సుధాకర్, భూపతి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ విజయానికి పాటుపడిన ప్రతి ఒక్కరికి రుణ పడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ప్రజల కోసం పనిచేసేవారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

### రాచకొండ సిపి సుధీర్‌బాబుతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

రాచకొండ సిపిగా నియమితులైన సుధీర్‌బాబును బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో పోలీసులు పనితీరు అద్భుతంగా ఉందని, ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రాజేశ్వర్‌యాదవ్

సైఫాబాద్, డిసెంబరు 13 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి జనాభా ప్రాతిపదికన బిసిలకు ఉప ముఖ్యమంత్రి పదవి, మంత్రి పదవుల్లో 50 శాతం పదవులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు పంపించడం జరిగిందని చెప్పారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో ఏర్పడబోయే ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలలో, ఛైర్మన్, ఇతర పదవులలో కూడా బిసిలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బిసిని ఉప ముఖ్యమంత్రిగా నియమించేంతవరకు ఉద్యమిస్తామని, ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద, ఇందిరాపార్కు వద్ద ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రవికుమార్, ప్రవీణ్‌కుమార్, పూసల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## అంజయ్య మృతి బిఆర్ఎస్‌కు తీరనిలోటు : పద్మారావు గౌడ్



అడ్డగుట్ట బిఆర్ఎస్ నేత అంజయ్య భౌతికాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు,కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 13 ప్రభాతవార్త: అడ్డగుట్ట బిఆర్ఎస్ నేత మృతి చెందడం పట్ల పార్టీకి తీరనిలోటు ఏర్పడిందని సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే టీ.పద్మారావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు,బిఆర్ఎస్ నేత టీ.అంజయ్య 70 ఈ నెల 7వ తేదీ తార్నాక నుంచి అడ్డగుట్ట మెట్టుగూడ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలపాలై సికింద్రాబాద్ యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పద్మారావు గౌడ్ అంజయ్య భౌతికాయానికి పుష్పగుచ్ఛం అందజేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబానికి లక్ష రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, మాజీ కార్పోరేటర్లు విజయ కుమారి,నక్క మల్లీశ్వరీ దేవీ, బిఆర్ఎస్ నాయకులు నక్క మధు, శ్రీనివాస్ గౌడ్, పెండెం మనోహర్, మధు గౌడ్, పొన్నాల రాజు, అడ్డగుట్ట నాయకులు జి.మల్లేశ్, హంసరాజ్, ఆర్.మల్లేశ్ కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రజాపతి శాస్త్రీయ సాంస్కృతిక ప్రదర్శనలు

నాంపల్లి, డిసెంబరు 13 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ నృత్యాలు కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, పేరిణి తదితర నాట్యప్రదర్శనలతోపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలను వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ప్రజాపతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత నూలు ఫణీంద్రకుమార్ మీడియాకు తెలిపారు. తమ ట్రస్టు ద్వారా వర్ధమాన కళాకారులను ప్రోత్సహించడానికి వివిధ రాష్ట్రాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి వేదికను అందించి ప్రతిభను చాటుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగం ఈ నెల 24న సుప్రసిద్ధ ఆధ్యాత్మిక దేవాలయం వరసిద్ధ వినాయక (కాణిపాకం), 25న శ్రీకాళహస్తి ఆలయాలలో నిర్వహించనున్న ప్రదర్శనలకు పైన పేర్కొన్న కళల ఔత్సాహిక కళాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సాంస్కృతిక నృత్యకళాప్రదర్శనల్లో పాల్గొనే కళాకారులకు ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నట్లు వివరించారు. ఆయా కళాకారుల గురువులకు జ్ఞాపికలతోపాటు వెయ్యినూటపదహార్ల నగదు బహుమతులను అందజేయనున్నట్లు ఫణీంద్రకుమార్ వివరించారు.

## ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

**దళితబహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్**

చిక్కడపల్లి, డిసెంబరు 13 ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని దళితబహుజన పార్టీ(డిబిపి) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. ఎస్సీ,ఎస్టీ అత్యాచార చట్టాన్ని దేశవ్యాప్తంగా పటిష్టంగా అమలుచేయాలని, ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులకు 41సిఆర్‌పిసి కింద పోలీసుస్టేషన్‌లో బెయిల్ ఇచ్చే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, ఈ విషయంపై హోంశాఖ ద్వారా రాష్ట్ర డీజీపీలు, హైకోర్టు, జిల్లా కోర్టులకు స్పష్టమైన ఆదేశాలను ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ శాతాన్ని 15 నుంచి 25శాతానికి పెంచుతూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని, దేశంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేస్తున్న ఎస్సీలకు ఎస్సీ స్కాలర్‌లకు స్కాలర్‌షిప్ పిహెచ్‌డి గ్రాంట్ నిధులు విడుదల చేయాలని, గ్రాంట్‌ను కూడా పెంచి నిధులను తక్షణ రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ ఫోటోను కరెన్సీనోట్లపై ముద్రించడానికి కేంద్రం చర్యలు చేపట్టాలని, ఎస్సీవర్గీకరణ చేయడానికి కేంద్ర కేబినెట్ ఆలోచనలను మానుకోవాలని, దళితులకు సామాజిక విచ్ఛిన్నం చేసే చర్యలు సరైంది కాదని, వర్గీకరణ అంశం దళిత జాతి అభివృద్ధికి ఉపయోగం కాదన్నారు. ప్రధాన పార్టీలకు రాజకీయాలకు ఉపయోగం పడుతుందే తప్ప, ఎస్సీల భవిష్యత్‌కు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఆర్టికల్ 341ను రాజ్యాంగంలో గట్టి పునాది వేసిన అంబేద్కర్ ఆశయాలకు విఘాతం కలిగించవద్దన్నారు.

## బస్తీలను పర్యటించి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



లంకబస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హైదరాబాద్, డిసెంబరు 13 ప్రభాతవార్త: వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి అధికారులతో బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గాంధీనగర్ లంకబస్తీ లో పర్యటించారు. నల్లకుంట డివిజన్‌లోని ఫీవర్ ఆసుపత్రి వెనుకగల లంకబస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో కలిసి డ్రైనేజీ సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అవసరమైన చోట్ల తక్షణమే రిపేర్లు చేపట్టాలని, అసంపూర్తిగా వదివేసిన పనులను కూడా వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే నింబోలిఅడ్డాలోని కాచి బస్తీలో వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి కాలేరు వెంకటేష్ పర్యటించారు. బస్తీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కారించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారి షకీర్, డివిజన్ అధ్యక్షుడు భీష్మిదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కకు అభినందనలు

నిజాంపేట్, డిసెంబర్ 13, ప్రభాతవార్త : రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్‌శాఖ, గ్రామీణ అభివృద్ధి, స్త్రీలు, శిశు సంక్షేమ శాఖల మంత్రి దస్సరి అనసూయ (సీతక్క)ను వారి స్వగృ హంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్ర మహిళా ఇంచార్జ్, అఖిల భారత మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్య దర్శిగా పనిచేసిన తెలంగాణ ఉక్కు మహిళ సీతక్కను కలిసి శుభాకాంక్షలు తెలపడం చాలా సంతోషంగా ఉందని కొలను శ్రీనివా స్‌రెడ్డి తెలిపారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



సైఫాబాద్, డిసెంబరు 13 ప్రభాతవార్త: రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు బుధవారం ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అపూర్వంగా పెద్ద ఎత్తున శుభాకాంక్షల పరంపర కొనసాగింది. శ్రీధర్‌బాబు రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం నుంచి వచ్చిన వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి బోకేలు అందించి, శాలువలతోసత్కరించారు. శుభాకాంక్షలతో, ప్రసంసలతో ముంచెత్తారు. మంథని నియోజక వర్గంలోని అనేక గ్రామాల నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కూడా పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, డిసెంబర్ 13 ప్రభాతవార్త: నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలో్ల కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో జిహెచ్ఎంసి వాటర్ వర్క్స్ పలు విభాగాలకు చెందిన అధికారులతో ఆయన సమావేశమై ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై ఆరా తీశారు. రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు, వంటి పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నూతనంగా మంజూరైన పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన ఇంజనీర్లు సుదర్శన్, ప్రభు,శశాంక్, సురేశ్, సంధ్యారాణి, బ్రహ్మారెడ్డి, రవిందర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే గాంధీని అభినందిస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులు

కూకట్‌పల్లి, డిసెంబర్ 13, ప్రభాతవార్త : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజు నగర్ కాలనీకి చెందిన కాలనీ వాసులు, అభిమానులు బుధవారం శేరిలింగంపల్లి శాసన సభ్యులుగా మూడోసారి భారీ విజయంతో గెలుపొందిన అరికెపూడి గాంధీని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నామీద విశ్వాసం ఉంచి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో నన్ను గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. శేరిలింగంపల్లి ప్రజానీకానికి ఎల్లవేళల ఋణపడి ఉంటాని అన్నారు. మరింత బాధ్యతగా శేరిలింగపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.

## మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి చర్యలు

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పోరేటర్ పన్నాల

నాచారం, డిసెంబర్ 13 ప్రభాతవార్త: మల్లాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ కాలనీలో నెలకొన్న భూగర్భడ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా సూమారు. రూ. 17 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పనులకు కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొదాసు లక్ష్మినారాయణ, కటర్ల భాస్కర్, రంగు మల్లికార్జున్ గౌడ్, వంగేటి సంజీవ రెడ్డి, బుసాని రఘు, నాగేందర్, ప్రవీణ్, సంపత్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను పరామర్శించిన నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



తార్నాక, డిసెంబర్ 13 ప్రభాతవార్త: సోమాజిగూడ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి,బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శ్రీలత శోభన్‌రెడ్డి బుధవారం పరామర్శించి ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లతో వారు మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని కేసీఆర్ భగవంతుడి కృపతో త్వరగా కొలుకొని సమూజ సేవలోకి రావాలని ఆకాంక్షించారు.

## శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బందికి చేయూత




వేతనాన్ని అందజేస్తున్న శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 13, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలోని శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బందికి చేయూత అందించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కెపిహెచ్‌బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజకుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు, పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా.సత్యం శ్రీరంగంని కోరారు. ఈ సందర్భంగా శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం నవంబర్ నెల వేతనాన్ని బుధవారం శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు చేతుల మీదుగా సత్యంశ్రీరంగం కార్యాలయంలో అందజేశారు.

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసిన ఉద్యమ నాయకులు**

తెలంగాణ ఎక్సైజ్‌శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను కూకట్‌పల్లికు చెందిన ఉద్యమకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లిలో గల శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో బుధవారం ఉద్యమ కారులైన దుంబల శ్రీనివాస్‌రెడ్డి, గుట్ట శంకర్ తదితరులు కలిశారు.

## శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో అన్నపూజోత్సవం

చిక్కడపల్లి, డిసెంబరు 13 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని పవిత్రమైన శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని అన్న అభిషేక మహోత్సవ కార్యక్రమం మంగళవారం ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సాగింది. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఏకవార రుద్రాభిషేకాలు, మహన్యాసరుద్రాభిషేకాలు, ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. మహన్యాసం ప్రారంభం అనంతరం బిల్వార్చన, అన్నపూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం ఈవో మాచర్ల దేవనాథం, ఆలయం అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## గంధర్వ గాయకులు ఘంటసాల మాస్టారు 101వ జయంతి

చిక్కడపల్లి, డిసెంబరు 13 ప్రభాతవార్త: శోభా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంధర్వ గాయకులు ఘంటసాల మాస్టారు 101వ జయంతి సందర్భంగా 'స్వరాభిషేకం' కార్యక్రమాన్ని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేం కట దీక్షితులు కళావేదికలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత్రి, మధురగాయని శోభారాణి వివరించారు. ముఖ్యఅతిథిగా సినీవిజ్ఞాన విశారద ఎస్వీ.రామారావు హాజరవుతారని, గాయనీ గాయకులు చింతలపాటి సురేశ్, వేటూరి రమాదేవి, అనంతలక్ష్మి పాతూరి, అంబాళం శ్రీకాంత్, విఆర్‌కె.ఫణి, వెంకటేశ్వరరావు, దుర్గాసౌజన్య, ఆర్.లక్ష్మి, శ్యామల, మల్లాది శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు గానం చేస్తారన్నారు. సంస్థ సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్న సందర్భంగా 'గాయకుడొక్కడే నటదిగ్గజాలెందరో' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.

## సినీ యుగళ గీత విభావరి

చిక్కడపల్లి, డిసెంబరు 13 ప్రభాతవార్త: రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సినీ, భక్తి గీతాలు, ఆకాశవాణి, దూరదర్శన్ 'ఎ'గ్రేడ్ గాయకుడు, మధురగాయకమౌళి డాక్టర్ అమలాపురం కన్నారావును ఘనంగా సత్కరించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి. ఎం.వి.సుబ్బలక్ష్మి వివరించారు. 15న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూధన్‌రావు హాజరై సత్కరిస్తారని, దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా 'ఘనాఘన గాయక' పేరుతో ఘంటసాల సినీ యుగళ గీత విభావరి కార్యక్రమంలో ఎం.వి.రమణకుమారి. ఎం.వి.సుబ్బలక్ష్మి సారథ్యంలో గాయనీ గాయకులు అంబాదాస్, మోహనకృష్ణ, చంద్రశేఖర్, వేణుగోపాలాచారి, కనక, సిహెచ్.లక్ష్మీమశాంతి, శైలజ, లలిత, గంటి రాజశ్రీ తదితరులు గానం చేస్తారన్నారు.

## మంత్రి డి.శ్రీధర్‌బాబు కలిసిన కేంద్ర టిఎన్‌జిఓ ఉద్యోగుల నాయకులు



అఫ్జల్‌గంజ్,డిసెంబర్13ప్రభాతవార్త:తెలంగాణ రాష్ట్ర నూతన ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును తెలంగాణ కేంద్ర సంఘం టిఎన్‌జిఓ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబును టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీమారం జగదీశ్వర్, ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్,సత్యనారాయణగౌడ్,కోశాధికారి రామినేని శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ, రంగారెడ్డిజిల్లా అధ్యక్షులులక్ష్మన్‌లు పలువురు కలిసి శాలువ కప్పి బోకె అందచేశారు.

## తలసీమియా రోగులకు రక్తదానం



బేగంబజార్,డిసెంబర్ 13ప్రభాతవార్త:తలసీమియా రోగులను ఆదుకునేందుకు ప్రతి ఒకరు మానవ దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త పిలుపు నిచ్చారు.కమల ఆసుపత్రి రిసెర్చ్‌సెంటర్ చికిత్స పొందుతున్న తలసీమియా రోగులకు పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసీమియా రోగులకు ప్రాణాలను కొట్టుమిట్టాడుతున్న వారికి రక్త దానం చేయడం ద్వారా వారి ప్రాణాలను నిలిపిన వారమవుతామన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమన్‌జైన్,తెలంగాణ భజరంగ్‌సేనా మహిళా అధ్యక్షురాలు రంజనీ శ్రీరామోజ్,ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా,మనోజ్‌మోగాలగిడి,నరేష్ పాల్గొన్నారు.

## మృతుడి బంధువులకు ఎల్ఓసి ఇచ్చిన ఎమ్మెల్యే



ఆసుపత్రి ఫీజు చెల్లించలేని వారికి ఎల్ఓసి లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 13 ప్రభాతవార్త : తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఎల్ఓసి ఇచ్చారు. మణికొండ మున్సిపల్ పరిధిలోని చిత్రపురి కాలనీకి చెందిన కెఎల్.కుమార్ నాయుడు తీవ్ర అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆసుపత్రిలో బిల్ కట్టలేక అవస్థలు పడుతున్న ఆయన కుటుంబ సభ్యులు స్థానిక కౌన్సిలర్లు వసంత్‌కుమార్ చౌహాన్, హైమాంజలిలను కలిశారు. కౌన్సిలర్లు వీరి దుస్థితిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు ఎల్ఓసి లెటర్ ఇచ్చి, నిమ్స్ ఆసుపత్రి ఉన్నతాకారులతో ఫోన్‌లో మాట్లాడి, మృతదేహంను కుటుంబ సభ్యులకు అప్పగించాని సూచించారు. ఈ సహాయం చేసిన ప్రకాశ్‌గౌడ్‌కు జీవితాంతం ఋణపడి ఉంటామని కుమార్ నాయకుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఓ పేద కుంటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వెంటనే స్పందించారని కౌన్సిలర్లు వసంత్ కుమార్, హైమాంజలిలు పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులలో ఉంటే వెంటనే సహాయం చేయడం, ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణాలే వరుసగా నాలుగు మార్లు ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాయని కౌన్సిలర్లు తెలిపారు.

## కబ్జాలను అరికట్టాలి: సిపిఐ

నిజాంపేట్, డిసెంబర్ 13, ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రెవెన్యూ పరిధిలో కబ్జాదారులు బాహాటంగా విచ్చలవిడిగా వందల ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని, పత్రికలు, ప్రతిపక్షాలు అధికారులకు వందలాది వినతిపత్రాలు సమర్పిస్తే కట్టడాలను ఎందుకు అరికట్టలేకపోతున్నారని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రతినిధి బృందం బుధవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేంద్రరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించి అడగడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలోనూ అన్ని మండలాల్లో వందలాది ఎకరాల భూమి అన్యాక్రాంతం అవుతున్నదని, స్వయంగా మునిసిపల్ చీఫ్ సెక్రటరీ అక్రమాలను గుర్తించి కూల్చివేయమంటే అధికారలు ఎందుకు కూల్చట్లేదని ప్రశ్నించారు. అదే విధంగా గాజులరామరంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ సర్వే నెంబర్ 326, 307కు సంబంధించి దేవేందర్ నగర్, మిథిలానగర్, బాలయ్య బస్తీ, రావినారాయణరెడ్డి నగర్ మొత్తం అన్యాక్రాంతం అయ్యిందని, సర్వే నెంబర్ 12లో అప్పటి కలెక్టర్ ఎం.వి.రెడ్డి హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటితే కబ్జా చేసారని, సూరారంలో విశ్వకర్మకాలనీ భూములు కబ్జా గురవుతున్నాయని అన్నారు. జగద్గిరిగుట్టలో 348/1లో దేవాదాయ భూమి, రాజీవ్ గృహకల్ప, భూములు కబ్జాకు గురవుతున్నాయని వెంటనే అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోరారు. ఈ కబ్జాలపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, బాచుపల్లి కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రావు, మండల కోశాధికారి సదానంద, ఏఐటీయూసి కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక నాయకులు కె.మహేష్, కె.నాగేశ్వర్‌లు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ విజయేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ సభ్యులు

## స్మశాన వాటిక పనులు పరిశీలించిన రేఖ యాదగిరి

నార్సింగి, డిసెంబర్ 13 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపల్ గౌలిదొడ్డి వివేకానందనగర్ కాలనీలో నిర్మితమవుతున్న స్మశాన వాటిక పనులను బుధవారం చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి పరిశీలించారు. మున్సిపల్ డిఇ నర్సిహ్మారాజు, ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌లతో కలిసి రేఖ స్మశాన వాటిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు పది కాలాల పాటు ఉపయోగపడేలా స్మశాన వాటికను నాణ్యతతో నిర్మించాలని ఆదేశించారు. ఆధునిక పద్ధతు ల్లో, అన్ని సౌకర్యాలతో, అహ్లాదకరమైన వాతావరణం ఉట్టి పడేలా స్మశాన వాటికను తయారు చేయాలని సూచించారు. దహన వాటికతో పాటు మృతుల బంధుగణం కూర్చునేందుకు, స్నానలు చేసేందుకు ఇలా అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా మంచినీరు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి, స్మశాన వాటికలు, పార్కులు ఇలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల ఇబ్బందులు దూరం చేస్తున్నామని, ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ప్రజల ఋణం తీర్చుకుంటున్నామని చైర్ పర్సన్ రేఖ యాదగిరి తెలిపారు.



గౌలిదొడ్డి వివేకానందనగర్ కాలనీలో జరుగుతున్న స్మశాన వాటిక పనులు పరిశీలిస్తున్న నార్సింగి చైర్ పర్సన్ రేఖ యాదగిరి

## పేదలకు వరం...మహాలక్ష్మి పథకం

-ఆరోగ్య శ్రీతో పేదల ఆరోగ్యానికి భరోసా

-నందిగామ ఎంపిపి ప్రియాంక శివశంకర్ గౌడ్



ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రయాణిస్తున్న ఎంపిపి ప్రియాంక శివశంకర్ గౌడ్

**నందిగామ డిసెంబరు13,ప్రభాతవార్త :**
కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం పేదలకు వరం లాంటిదని నందిగామ ఎంపిపి ఎం.ప్రియాంక శివశంకర్ గౌడ్ అన్నారు.బుధవారం నందిగామ మండలం చేగూరు గ్రామంలో ఆమె మాట్లాడారు.. నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలు రాష్ట్రంలోని నిమ్స్, గ్లోబల్,యశోద లాంటి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల్లో నాణ్యమైన చికిత్స పొందేందుకు 10 లక్షలు ఆరోగ్య బీమా పథకం ద్వారా రాష్ట్రంలో ఎన్నో నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు.ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించిందని తెలిపారు.ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అంటే ఏమిటో వారం రోజుల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నిరూపించారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలలో రెండు గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టారని,మిగతా నాలుగు గ్యారెంటీ పథకాలకు విధి,విధానాలు రూపొందుతున్నాయని త్వరలోనే పథకాలన్ని అమలు కావడం పక్కా అని ఆమె దీమా వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహాపడిపూజ



కొత్తగూడ గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

**కందుకూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త:**
మండల పరిదిలోని కొత్తగూడ చౌరస్తాలో అయ్యప్ప మహపడి పూజ కార్యక్రమం భక్తిశ్రద్దలతో భక్తులు వైభవంగా నిర్వహించారు. కొత్తగూడ గ్రామానికి చెందిన గురుస్వామి బొక్క సురేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ అయ్యప్పస్వామివారి మహపడిపూజ కార్యక్రమం నిర్వహించగా వివిద ప్రాంతాలనుండి సన్నిదానాల నుండి అయ్యప్ప మాలదారనచేసిన స్వాములు పెద్దసంఖ్యలో ఈ మహపడిపూజా కార్యక్రమంలో పాల్గొని భక్తిపారవస్యంతో భజనలుచేసి పడినికాల్చి మహపడిపూజా కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్బంగా గురుస్వామి సురేందర్‌రెడ్డి మాట్లాడుతు ప్రజలు అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అద్యాత్మిక చింతనద్వారా మానసికదృడత్వం పెరుగుతుందని సత్‌సాంప్రదాయం పెరుగుతుందని తెలిపారు. అయ్యప్పస్వాల 40 రోజుల ఖఠిన దీక్షలద్వారా మన శరీరంపైన నియంత్రన పెరిగి చెడువ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు అ అలవాట్లను జీవితంలో బాగంగా మార్చుకుని ముందుకు సాగితే జీవితం అనందమయంగా ఉంటుందని పేర్కోన్నారు. అయ్యప్ప స్వాములు సమాజానికి మార్గదర్షకులుగా నిలవాలని సూచించారు. ఈ పూజాకార్యక్రమం సందర్బంగా సువర్ణ అంజిరెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## తిరుపతిరెడ్డిని కలిసిన మండల నాయకులు



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు.

**బొంరాస్‌పేట్,డిసెంబర్13,ప్రభాతవార్త :**
కొడంగల్‌లో కాంగ్రేస్‌పార్టీ విజయం సాధించడంతో పార్టీ ఇంచార్జీ తిరుపతిరెడ్డిని అయన నివాసంలో బొంరాస్‌పేట్ మండల పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్‌తోపాటు గట్టేగానితాండకు చెందిన వంశీకృష్ణ,పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూలదండతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లేషం,శంకర్‌నాయక్, రాజునాయక్, రవి, లక్ష్మణ్,లింగ్యానాయక్ ,సేవ్యానాయక్,కాంగ్రేస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ జీవితబీమా పాలసీలను ఖాతాదారులు వినియోగించుకోవాలి : మేనేజర్ సతీష్

**బొంరాస్‌పేట్,డిసెంబర్13,ప్రభాతవార్త :** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందిస్తున్న జీవితబీమా పాలసీలను బ్యాంకు ఖాతాదారులు ఉపయోగించుకోవాలని బొంరాస్‌పేట్ బ్రాంచ్ మేనేజర్ సతీష్ అన్నారు.ఎస్‌బిఐలో 20రూపాయాల నుండి 10లక్షల రూపాయల వరకు జీవితబీమా పథకాలు ఉన్నాయన్నారు. ఖాతాదారులు ప్రతి ఒక్కరు తప్పకుండా ఎదైన ఒక జీవితబీమా పాలసీని ఎన్నుకోవాలని అన్నారు.ప్రతిసంవత్సరం 20రూ.,లు లేదా 428రూపాయలతో 2లక్షల జీవితబీమా లభిస్తుందని,ఒక వేయితో 20లక్షల జీవితబీమా ఉటుందని అయన తెలిపారు. వీటితోపాటుగా 60సంవత్సరాల తర్వత ఫెన్షన్ పొందేందుకు కూడా పాలసీలు ఉన్నాయని అన్నారు.చిన్నారులు,మహిళాల కోసం కూడా ప్రత్యేక పాలసీలతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.5' శాతం వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు.బొంరాస్‌పేట్ బ్రాంచ్‌కు వస్తున్న ఖాతాదారులు బ్యాంకు సిబ్బందికి సహకరించి వారి నుండి సహాయం పొందాలని అయన ఖతాదారులకు కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సిఎం కెసిఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** మాజీ సీఎం కేసిఆర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బుధవారం నగరంలోని యశోద ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సీఎం కేసిఆర్ యొక్క ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాసేపు మాజీ సీఎం కేసిఆర్‌తో ముచ్చటించారు. మాజీ సీఎం కేసిఆర్ త్వరగా కోలుకోవాలని ప్రజల పక్షాన అసెంబ్లీలో దళం విప్పాలని ఆయన ఆకాంక్షించారు.



మాజీ సీఎం కేసిఆర్‌ను పరామర్శించి కేసిఆర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

# ప్రజల తీర్పును గౌరవిస్తా : మాజీ ఎమ్మెల్యే ఆనంద్

**ధారూర్ డిసెంబరు13,ప్రభాతవార్త :**
ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధారం ధారూర్ మండల పరిధిలోని ఎబ్బనూర్,అల్లిపూర్ గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఎన్నికల్లో ఓడిపోయిన ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేద్దామన్నారు.మీతోనే ఉంటూ మీ అందరికి అండగా ఉంటానని నిర్విరామంగా ప్రజా శ్రేయస్సుకు కృషి చేద్దామని పేర్కొన్నారు.కష్టసుఖాల్లో తనకు అండగా ఉన్న పార్టీ కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని తెలిపారు.అనంతరం ఆయన మాజీ ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర్ రావు త్వరగా కోలుకోవాలని ఎబ్బనూర్ గ్రామంలోని హనుమాను మందిర్‌లోని శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్,మండల సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి,సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ,చంద్రమౌళి,చెన్నయ గౌడ్,రాములు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

## యంనంపేట్ రంగనాయక స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష



పోచారం మున్సిపల్ యంనంపేట్‌లోని శ్రీ భూనీళ సమేత రంగనాయక స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 13, ప్రభాతవార్త:**
వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ భూనీళ సమేత రంగనాయక వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తామని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ యంనంపేట్‌లోని శ్రీ భూనీళ సమేత రంగనాయక స్వామి దేవాలయ ప్రాంగణంలో చైర్మన్ కొండల్ రెడ్డి అధ్యక్షతన బుధవారం దేవాలయ కమిటీ సభ్యులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశమున్నందున భక్తులకు అసౌకర్యం కలుగకుండా పారిశుధ్యం, పార్కింగ్, తాగునీటి వసతి, భక్తులకు క్యూ లైన్లు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు అందరు వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమన రెడ్డి, ఆలయ ఈవో భాగ్యలక్ష్మి, నర్రీ కాశయ్య, పి. రాజేశ్ గౌడ్, మీసాల రాజేశ్, బొక్క బుచ్చిరెడ్డి, రవికాంత్, సగ్గు రవీందర్, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-సర్వసభ్య సమావేశంలో విద్యుత్, విషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం

-అందుబాటులో ఉండి సేవలందించాలన్న ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 13,(ప్రభాతవార్త):**
గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపిపి యాదమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సభ్యులు చర్చించారు. ముఖ్యంగా మండలంలోని ఎదిర, తుమ్మలపల్లి, గాలిగూడ, పెద్ద ఎల్కిచర్ల, జిల్లెడు, వనంపల్లి, మల్కపహాడ్, ధర్మ్యతాండ, తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్‌లు సభా దృష్టికి తీసుకువచ్చారు. గతంలో విద్యుత్ సమస్యలపై తెలిపిన సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. గ్రామాల్లో గల విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులకు తెలిపి ఏ మాత్రం ప్రయోజనం లేకుండ పోయిందని అన్నారు. గ్రామ ప్రజలతో ప్రతి నిత్యం తిట్లు తినె పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజల పక్షాన ఉన్న సర్పంచ్‌లను ఇబ్బందులు పెట్టవద్దని పెర్కోన్నారు. సమస్యల సాధనకు వీలైనంత త్వరగ కృషి చేయాలని తెలిపారు. నిర్లక్షం వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సి వస్తుందని ఆయన పెర్కోన్నారు. అలాగె మిషన్ భగీరథ నీటి సరఫరలో స్పష్టటత లేదని సభ్యులు సభా దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఎప్పుడు నీరు వస్తుందో ఎప్పుడు నీటి సరఫర నిలిచిపోతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులకు నిటి సరఫరపై సమాచారం ఉండదని పెర్కోన్నారు. అలాగె పల్లె ప్రకృతివనం, స్మశానవాటికల బిల్లుల చెల్లింపులో జాప్యం గురించి సభలో చర్చించారు. అధికారులు ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండి సమస్యలు పూర్తి స్థాయిలో సరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను అదేశించారు. అందరు కలిసికట్టుగ పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా ఉండి గ్రామాలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేసి సుందరంగ మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బంగారు స్వరూప, వైస్ ఎంపిపి అశ్రబేగం, పిఎసిఎస్ చైర్మన్ ధామోదర్‌రెడ్డి, ఎంపిడిఓ మహెష్‌బాబు, తహసీల్దారు విజయ్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గోన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## సుందరకాండ పారాయణం పూర్తి...పూజా కార్యక్రమాలు ప్రారంభం



రామాయణం గ్రంధాన్ని ఊరేగింపు తీసుకెళ్తున్న ఆలయ ధర్మకర్తలు

**కొత్తూర్, డిసెంబర్ 13, ప్రభాతవార్త :**
శ్రీరాంనగర్ కాలనీ హనుమాన్ దేవాలయంలో సుందరకాండ పారాయణం పూర్తి, పూజా కార్యక్రమాలు కొత్తూర్ పురపాలికలోని శ్రీరాంనగర్‌కాలనీలో గల హనుమాన్ దేవాలయంలో రాజేంద్రప్రసాద్, సురేంద్రప్రసాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కొత్తూర్ మార్వాడి సుందరకాండ భక్తమండలి సభ్యులు ప్రతి గురువారం సుందరకాండ 100 పారాయణాలు 101 గురువారాలు సుందరకాండ పారాయణాలు పూర్తి చేశారు. 101గురువారాలో ప్రతి గురువారం సాయంత్రం శ్రీహనుమాన్ దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేటితో 101 గురువారాలు సుందరకాండ 100 పారాయాణాలు పూర్తికావడంతో మార్వాడి సుందరకాండ భక్త మండలి సభ్యులు, మహిళలు భక్తులతో కలిసి ఊరేగింపుగా ఆలయ ధర్మకర్త రాజేంద్రప్రసాద్ శుక్ల, సురేంద్రప్రసాద్ శుక్ల రామాయణ గ్రంథాన్ని తలపై పెట్టుకుని శ్రీశివమారుతి హనుమాన్ దేవాలయం నుండి శ్రీరాంనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం వరకు భక్తిశ్రద్దలతో ఊరేగింపుగా వచ్చి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాయణం పారాయణం బుధవారం నుండి గురువారం వరకు సుమారు 24గంటల పాటు పట్టించి గురువారం యజ్ఞ హోమాలతో పూర్తి చేసి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భక్తమండలి వారు తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యాసాగర్ శుక్ల, మహావీర్ శుక్ల, పెద్ద ఉమారాణి శుక్ల, చిన్న ఉమారాణి శుక్ల, విజేత శుక్ల, సీనియర్ నాయకులు దేవేందర్ ముదిరాజ్, నాగరాజుచారి, వి.శ్రీనివాస్, శివచారి, నేమ్ చందు, అరవింద్, నిర్మల్ బాబులాల్ జగదీష్, భవాని, శంకర్, ఆశోక్, బన్వర్‌లాల్ లీలేదర్ హుక్మీ, చందు, మురలీదర్, హరిలాల్, బంటి, మనోజ్, భక్త మండలి సభ్యులు ఉన్నారు.

## ప్రమాదాలకు కారణమైన బ్రేక్ కట్ట తొలగింపు

(వార్త కథనానికి స్పందన)



ప్రమాదాలకు కారణమైన బ్రేక్ కట్టను తొలగిస్తున్న దృశ్యం

**యాచారం డిసెంబరు13,ప్రభాతవార్త :**
యాచారం మండల సాగర్ రహదారిపై గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న బ్రేక్ కట్టతో ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారు.గ్రామస్తులు ప్రయాణికులు ఆర్అండ్‌బి అధికారులకు ఎన్నో మార్లు వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్న స్పందించలేదు.వందల మంది ప్రమాదాలకు గురయ్యారు.కొంతమంది తీవ్ర గాయాల పాలై కొట్టుమిట్టాడారు.వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన గ్రామ కార్యదర్శి తిరుపతి బుధవారం బ్రేక్ కట్టను తొలగించారు.ప్రమాదాలు జరగడం ఎంతో బాధకరమని ఇలాంటివి తమ దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామని కార్యదర్శి పేర్కొన్నారు.

## మల్లన్న స్వామి ఆలయ అన్నదాన సత్రానికి భూమిపూజ



అన్నదాన సత్ర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ

**షాబాద్, డిసెంబర్ 13, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయంలో అన్నదాన సత్ర నిర్మాణానికి బుధవారం ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య గ్రామస్థులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఆలయంలో భక్తులకు సౌకర్యార్థం అన్నదాన సత్రాన్ని, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధితో పాటు,ఆలయాల నిర్వహణ కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్థులు మీసాల యాదయ్య,ఎలిజెర్ల మల్‌రెడ్డి, అమీర్‌పేట్ మాధవరెడ్డి, రాపోల్ రాజేందర్, అమీర్‌పేట్ గోవర్ధన్‌రెడ్డి, రాపోలు నారాయణ, అంజయ్య, అమీర్‌పేట్ అనువర్ధన్‌రెడ్డి, అమీర్‌పేట్ అంజిరెడ్డి,ఉపసర్పంచ్ రంగం శ్రీనివాస్ ఉన్నారు.

## కర్కాలమ్మ ఆలయం వద్ద బోర్ వేయించిన దాత కెటిఆర్



బొమ్మరాసిపేట్‌లో శ్రీకర్కాలమ్మ ఆలయం వద్ద బోర్ వేయించిన దాత కొండుగారి తిరుపతిరెడ్డి (కెటిఆర్) నీరు రావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 13, ప్రభాతవార్త**
బొమ్మరాసిపేట్ గ్రామంలోని శ్రీ కర్కాలమ్మ ఆలయం వద్ద ప్రజలకు నీటి సౌకర్యం కల్పించటానికి దాత కొండుగారి తిరుపతిరెడ్డి (కెటిఆర్), బ్రదర్స్ ముందుకు వచ్చి బోర్‌ను వేయించటంతో పుష్కలంగ నీరు పడటంతో సంతోషంగ ఉందన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ గ్రామంలో శ్రీకర్కాకలమ్మ ఆలయం వద్ద కెటిఆర్, బ్రదర్స్,మాజీ ఎంపిటిసి కొండుగారి చంద్రమ్మ, పటేల్ భాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సింగిరెడ్డి అంజిరెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిల 8వ వార్డుమెంబర్ విమల భాస్కర్‌రెడ్డిల, ముదిరాజ్‌ల సహకారంతో ఈ బోర్‌ను వేయించినట్లు దాత కెటిఆర్ బ్రదర్స్ తెలిపారు. ముదిరాజ్‌ల, గ్రామ ప్రజల అందరి సహకారంతో దాతగ ముందుకు వచ్చి బోర్ వేయించామని దాత కొండుగారి తిరుపతిరెడ్డి తెలిపారు. గ్రామంలో సేవా కార్యక్రమంలో భాగంగ బోర్ వేయించటం జరిగిందని కొండుగారి తిరుపతిరెడ్డి తెలిపారు.

## విద్యుత్తు తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

**చౌడాపూర్ డిసెంబరు13,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మరికల్ గ్రామానికి చెందిన బండ మహేష్ తన పశువుల కోసం ట్రాక్టరులో వరిగడ్డిని తీసుకెళ్తుండగా కరెంటు తీగలు తగలి పూర్తిగా గడ్డి దగ్ధమైంది. కటికే వెంకటేష్ దగ్గర వరి గడ్డి కొనుగోలు చేసి,తరలిస్తుండగా అంతం పల్లి గ్రామ శివారులో ఉన్న కరెంటు తీగలు తగలి మంటల చెలరేగాయి.ప్రమాదం వల్ల బండ మహేష్‌కు 10వేల రూపాయల వరకు నష్టం జరుగుతందని ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## సర్వసభ్య సమావేశంలో విద్యుత్ అధికారులపై వైస్ ఎంపిపి మండిపాటు





సమావేశంలో ఎంపిపి,జడ్పిటిసి,వైస్ ఎంపిపి ,ఎమ్మార్వో ,ఎంపిడివో పాల్గొన్న దృశ్యం

**యాచారం డిసెంబరు13,ప్రభాతవార్త :**
యాచారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి కొప్పు సుకన్య భాష అధ్యక్షతన ఎంపిడివో విజయలక్ష్మి ఆధ్వర్యంలో సాదాసీదాగా సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.మండల వ్యవసాయ శాఖ అధికారి సందీప్ కుమార్ గత మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను వివరించారు.అనంతరం విద్యుత్ శాఖ ఏఈ వివరిస్తుండగా పలు గ్రామాల సర్పంచ్‌లు,వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి పనితీరు బాగాలేదని ప్రైవేట్ వ్యక్తులకు పనిచేసి పెడుతున్నారని ప్రభుత్వం అందించే వాటిపైన ఇతరులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు.ప్రజలకు సేవలు అందించడంలో పూర్తి విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంచర్లకు ప్రైవేటు వ్యక్తులకు సాదనంగా పోల్స్ అందజేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయని గుర్తు చేశారు.అనంతరం విద్యా శాఖలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీర యాదమ్మ, బండిమీద కృష్ణ,కంబాలపల్లి సంతోషం,జగదీష్ నాయక్,ఎంపిటిసిలు జ్యోతి అరవింద్ నాయక్,లక్ష్మీపతి గౌడ్,రాజేందర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు సర్పంచ్, ఎంపిటిసిలు,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్ గాయత్రి



ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కౌన్సిలర్ గాయత్రి, లక్ష్మణ్

**వికారాబాద్,డిసెంబర్ 13, ప్రభాతవార్త:**
బీఆర్ఎస్ పార్టీకి చెందిన 31వ వార్డు కౌన్సిలర్ మాలె గాయత్రి, ఆమె భర్త మాలె లక్ష్మణ్‌లు బుధవారం వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాలె గాయత్రి లక్ష్మణ్ లకు కాంగ్రెస్ పార్టీ కాండువా ను ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు దీపక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరిపల్లి శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో అన్నదానం



శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాతలను సన్మానించిన ఆలయ గ్రామ పెద్దల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 13, ప్రభాతవార్త**
ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద 179వ బుధవారం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బుధవారం అన్నదాతలుగ బండ్లగూడ నివాసులు వి.వెంకటేశ్వర్‌రెడ్డి-లక్ష్మి, కూతుళ్లు విష్ణుతా, వినుత్రలు, బోయినపల్లి నివాసులు వి.వినయ్‌రెడ్డి-సురేఖ, కుమారులు రుషికిరణ్‌రెడ్డి, రుద్రప్రతాప్‌రెడ్డిలు అన్నదాతలుగ నిలిచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ వారు, గ్రామపెద్దలు దాతలను శాలువాలతో సత్కరించి అభినందించారు.

## పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలి





సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**తాండూరు, డిసెంబరు 13, ప్రభాతవార్త :**
రాబోయే పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అందరు సిద్ధంగా ఉండాలని బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ చంద్రశేఖర్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వచ్చే పంచాయితీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం తాండూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని గ్రామాల వారిగా సర్పంచులు, వార్డు మెంబర్లుగా పోటీ చేసేందుకు భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీతక్కకు శుభాకాంక్షలు

**కడ్తాల్,డిసెంబరు 13 ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా, శిశు, సంక్షేశాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క)ను తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మి నర్సింహరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఐదు సంవత్సరాలలో సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీలలో చేసిన పలు అభివృద్ధి పనుల వివరాలను మంత్రికి తెలియజేశారు. అదేవిధంగా సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గురించి మంత్రికి వివరించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని, సర్పంచ్‌లందరూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు జూలూరు ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు